# పరామర్శ

ఒకడి చావుతో కథను ప్రారంభించడం యథార్థానికి నాకిష్టంలేదు!.... కాని ఏంచెయ్యడం?.... అతగాడు ఊరిపెద్ద! చనిపోయేడవాళ!

ఊరిపెద్ద చనిపోయినప్పుడు, ఊళ్ళోవాళ్ళంతా అతగాడింటి కెళ్ళి, శవదర్శనం చేసుకొని, తమ ప్రగాఢ సానుభూతుని చనిపోయినవాడి ఆత్మీయులకు తెలియజెయ్యడం మనప్రాచీన సంప్రదాయాలలో ఒకటి! ఈ సంప్రదాయాన్నెరిగినవాళ్ళంతా అతగాడింటికి బయలుదేరేరు; తమ సానుభూతిని అతగాడి ఆత్మీయులకు తెలియచేసి, శ్రద్ధాంజలి ఘటించేటందుకు!....

ఊరూపేరూ లేని ఊకాయి నాకాయిగాడు చస్తే ఎవ్వరూ అంతగా పట్టించుకోరు!

"పెదబాబు" ఊరూపేరూ లేని ఊకాయి నాకాయిగాడేం కాదు!....చుట్టు ప్రక్కల సుమారు పాతికకిలోమీటర్ల పరిధిలో పెదబాబుని చూడనివాళ్ళు లేరంటే అతిశయోక్తికాదు.

నామకరణ మహోత్సవంనాడు పెదబాబు తల్లిదండ్రులు అతడికి పెట్టిన పేరేమిటో, అతగాడి ఆత్మీయులకు తప్పితే యితరులకు తెలీదు!.... అప్పలారాజుగారి పెద్దకొడుకు కాబట్టి, అతడు మాప్రాంతంలో అందరికి "పెదబాబు" అయిపోయేడు! అప్పలారాజుగారు, ధర్మరాజుగారి కొడుకు!.... ధర్మరాజుగారు తమ్మిరాజుగారి కొడుకు! తమ్మిరాజుగారు శివరాజుగారి కొడుకు!.... మరి శివరాజు ఎవరికొడుకో తెలీదు!!........

కాని కొంతమంది ఆవూరి ముసలివాళ్ళు, అతి రహస్యంగా అనుకున్న ఓ విషయం యీామధ్యే బయటుకు పొక్కింది!....

పెదబాబు వంశానికి చెందిన పూర్వీకుడెవడో, ఏడు తరాల క్రితం—ఓ నవాబుగారికి ఓయుద్ధంలో గొప్పగా సహాయం చేసేడట!.... అట్లా అతగాడు ఆనవాబుగారికి సహాయం చేసే నాటికి, అతగాడు గొప్పవాడేంకాడట!.... ఓచిన్న బందిపోటు దొంగలముఠాలో, ఓచిన్న బందిపోటు దొంగగారట!.... అయితేనేం?.... ఆనవాబుగారి విజయానికి సహాయపడిన వాళ్ళల్లో ఓ ముఖ్యుడైనందువల్ల - ఆనవాబుగాడు కృతజ్ఞతా సూచికంగా, అతగాడికి ఆగ్రామాన్ని ఏలుకోమని యిచ్చేశారట!.... అప్పటినుండి ఆచిన్న బందిపోటు దొంగగారు, దొంగతనాలు చెయ్యడంమానేసి; ఓదొరలాగ దర్జాగా ప్రజల దగ్గరనుండి అంచక్కా పన్నులు వసూలుచేస్తూ, ఆ గ్రామస్థుల పాలిటి పరిపాలకుడయిపోయేడట!....

అప్పటినుండి అతడి వంశం వాళ్ళంతా ఆప్రాంతప్రజలకు "బాబులు" అయిపోయేరు!

ప్రభుత్వాధిపత్యం ఎవరి చేతుల్లోవుంటే వారికి విధేయులై యుండడం ఆవూరి బాబుగార్ల ప్రత్యేకత!....

ఇకపోతే ఆప్రాంత ప్రజల ప్రత్యేకత ఏమిటీఅంటే; ఆ వూరి బాబులకు విధేయులైవుండడం!

పెదబాబుగారు ఆవూరికి తారురోడ్డు వేయించేరు! తారు రోడ్డు వేయించేక వారొక కారు కొనుక్కున్నారు!

పెదబాబుగారు తన పలుకుబడిని ఉపయోగించి, ఆవూరికి విద్యుచ్ఛక్తి సౌకర్యాన్ని కలుగజేయించేరు!.... దాంతో ఆవూరు

జిగేలుమంది !.... పెదబాబుగారిల్లు మరింత కాంతి వంత మయింది. హాతి పడకగది ఎయిర్ కండిషన్ చేయబడింది !....

తగిన ప్రయాణ సౌకర్యాలులేక ఆ ప్రాంతప్రజలు, తెగ బాధపడిపోతూండడం చూడలేక, బస్‌రూట్లు సేంక్షన్ చేయించేరు పెదబాబుగారు. వారే స్వయంగా బస్సులుకొని, ప్రజా సౌకర్యార్థం నడపసాగేరు.

చాలా లఘుపరిశ్రమల్ని స్థాపించి, ఎంతోమందికి ఉపాధి కల్పించేరు.

ఆవూరంతటికీ అతనొక్కడే "చిన్నకారు" రైతు! అంటే; చిన్నకారున్న రైత్ననమాట!

ఆవూరికొచ్చే గొప్పవాళ్ళంతా పెదబాబుగారి ఆతిధ్యం స్వీకరించి తీరాల్సిందే!....

అట్లాంటి మహానుభావుడు అవాళ చనిపోయేడు. అందుకనే ప్రాంతప్రజలంతా బయలుదేరేరు; అంతిమదర్శనం చేసుకొని - పెదబాబుయొక్క ఆత్మీయులకు తమసానుభూతిని తెలియ జేసేటందుకు

అతడు చచ్చినట్లు కనిపించలేదు. కళ్ళు తెరచి అందరికేసి చూస్తున్నట్లేవున్నాడు !

గొప్పవాళ్ళ ఆత్మీయులు - మామూలు అలగాజనుల్లా తమ వాళ్ళుచస్తే గుండెలుబాదుకుంటూ లబోదిబోమని ఏడవరు!.... ఆ ఏడుపులోకూడా నాగరికతను ప్రదర్శిస్తారు !

పెదబాబుగారికి ఒక్కడే కొడుకు. తండ్రికి తగ్గ కొడుకని ఆప్రాంతంలో అందరి ప్రశంసల్ని ఏనాటినుండో అందుకుం

టున్నాడు !!.... ఆ ప్రాంతంలో "చినబాబు"గా అతడు ప్రఖ్యాతినొందేడు. తండ్రి శవందగ్గర కూర్చొని, తనను పరామర్శించేటందు కొచ్చే వారందరికి ఆర్ద్ర న య నా ల తో స్వాగతం చెపుతూ- ఉండుండి దుఃఖాన్ని మాటలరూపంలో వెలిగక్కుతున్నాడు !

ఎవరికి తోచినరీతిలో వారతనిని ఓదార్చుతున్నారు.

చినబాబు దుఃఖాన్ని దిగమింగుకుంటూ - తనను పరామర్శించేటందుకొస్తున్న వారందర్నీ గమనిస్తూ - మనసులో లెక్కేసుకుంటున్నాడు; తనను పరామర్శించడానికి రా వాళ్ళింకా ఆవూళ్ళో ఎవరెవరు మిగిలిపోయేరా అని !

*　　*　　*　　*

పార్వతమ్మ కొడుకు, 'గణపతి' కి అవాళమహదానందగా వుంది; ఎవరూ చంపకుండానే పెదబాబు చచ్చినందుకు !

"ఊళ్లో వాళ్ళంతా చినబాబుని పరామర్శించడానికి వెళుతూ వుంటే, నువ్విలా సరదాగా యింట్లో కూర్చున్నావేంటి ? ఓసారెళ్ళి చినబాబుని పరామర్శించిరా!.... పరామర్శించడానికి వెళ్ళకపోతే బాగుండదు. మాటపడిపోతాం!"అనంది పార్వతమ్మ.

గణపతి తల్లికేసి చిరాగ్గా చూస్తూ "ఇంతకాలం మనం ఎవడిని చూసి భయపడ్డామో వాడు చచ్చేడు!! చచ్చినవాడు ఇక మననేం చెయ్యగలడు?.... శవాన్ని చూసి యింకా భయపడమంటావా?" అనడిగేడు

"నాయినా గణపతీ!.... ఆ చినబాబు, తండ్రిని మించిన దుర్మార్గుడు!.... వాడితో విరోధపడి మనమీవూళ్లో బ్రతకలేము వేగంగా వెళ్ళి ఓసారి పరామర్శచేసొచ్చేయి!'' అనంది.

పార్వతమ్మ వీరమాతకాదు!.... వీరమాతల కథలు ఆమె వినలేదు!.... అందుకనే అట్లా అంది.

అట్లా తనతల్లి, తనతలకెక్కించిన పిరికిమందు అతటి నరాలను కంపింపజేసింది!

మారుమాటాడకుండా గణపతి పరుగెట్టేడు; చినబాబుని పరామర్శించేటందుకు!

[07-03-1981 వ తేదీ "కృష్ణాపత్రిక" నుండి]

